పద్మాలయ చెరువుకు చెర

విశాలాంధ్ర-తొట్టంబేడు : అధికారం... అవకాశం... అడిగే వారు లేకపోతే ఆక్రమణలకు అడ్డేముంది. తొట్టంబేడు మండలంలో ఇదే జరుగుతోంది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు పరాధీనమైపోతున్నాయి. నిజాయితీ గల అధికారులు అడ్డుకోవడానికి యత్నిస్తే వారిపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారు. ఈ కారణంగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారు. ఫలితంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఇదే కోవలోకి పద్మాలయ చెరువు చేరింది. శ్రీకాళహస్తి-చెన్నై ప్రధాన రహదారి పక్కనే తొట్టంబేడు పంచాయతీ పరిధిలో సర్వే నంబరు 12లో 20.77 ఎకరాల విస్తీర్ణంలో పద్మాలయ చెరువు ఉంది. ఇది తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. ఒకమాటలో చెప్పాలంటే పద్మాలయ చెరువు శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో ఒక భాగమైంది. దీనిని బట్టి ఈ భూమి విలువ ఎలా చెప్పవచ్చు. ఈ ప్రాంతంలో ఒక అంకణం భూమి రూ.లక్ష వరకు పలుకు తోంది. ఈ చెరువుకు పక్కనే ఉన్న డంపింగ్ యార్డు స్థలంలో శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజను కార్యాలయం నిర్మిస్తామని స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఇక్కడ ఆర్డీవో కార్యాలయం నిర్మిస్తే ఈ భూమి విలువ మరింత పెరుగుతుంది. ఇంతటి విలువైన పద్మాలయచెరువు భూమిని అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే కొందరు పద్మాలయ చెరువును ఆక్రమించి ప్రహరీ కూడా నిర్మించారు. 20.77 ఎకరాల విస్తీర్ణం చెరువు ప్రస్తుతం 10 ఎకరాలు కూడా లేదు. ఉన్న చెరువును కూడా కొందరు రాత్రికి రాత్రే ఆక్రమిస్తున్నారు. ఆక్రమణలు అడ్డుకోవడానికి యత్నించే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు చేయిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి పద్మాలయ చెరువును అక్రమార్కుల చెర నుంచి కాపాడాల్సి ఉంది. ఈ విషయమై తొట్టంబేడు తహసీల్దారు ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డిని వివరణ కోరగా పద్మాలయచెరువును సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు. అక్రమార్కులు ఎంతటి వారైనా వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. చెరువును ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.కోట్ల విలువైన భూమి పరాధీనం

బయో మెడికల్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఉత్పత్తి అవుతున్న బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయ పద్ధతిలో డిస్పోజ్ చేయాలని, వాటిని సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి జిల్లా బయో మెడికల్ వ్యర్థాల మాని టరింగ్ కమిటీ ఛైర్మన్ హోదాలో అధికారులను ఆదేశిం చారు. జిల్లా బయో మెడికల్ పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రు ల్లో ఉత్పత్తవుతున్న వివిధ రకాల వ్యర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన కలర్ కోడింగ్ బ్యాగుల్లో మాత్రమే సేకరించి వ్యర్థాల నిర్మూలన ఫెసిలిటీలకు, కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీకి మాత్రమే పంపించాలని తెలిపారు. అలాకాకుండా జనరల్ వ్యర్థాలతో కలిపి డిస్పోజ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ చట్టాలు ప్రకారం బయో వ్యర్థాల నిర్వహణ శాస్త్రీయ పద్ధతులలో జరుగు తున్నాయా? లేదా అనే విషయాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వారు విడుదల చేసిన జీఓలను అనుసరించి జిల్లా బయో మెడికల్ వ్యర్థాల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుతో ఈ సమావేశం నిర్వహించు కుంటున్నామని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు ఆసుపత్రులపై అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. పర్యావరణ ఇంజనీరు సరేంద్ర బాబు మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాలను సమర్థ వంతంగా శాస్త్రీయ పద్ధతులలో నిర్వహించడానికి అన్ని ఆసుపత్రులలో బార్ కోడింగ్, జీయో ట్యాగింగ్, సిసి కెమెరాల ద్వారా వ్యవస్థలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డాక్టర్. శ్రీహరి, ఆనంద మూర్తి, తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చంద్ర మౌలిశ్వర రెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్. డా.యువ అన్వేష్., కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది శశికళ పాల్గొన్నారు.

24 మంది సభ్యులతో టీటీడీ నూతన పాలక మండలి

- ముగ్గురు ఎమ్మెల్యేలకు అవకాశం - అంతా కొత్త వారికే చోటు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలిలో సభ్యులుగా 24 మందికి చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల కాల పరిమితికి ఇటీవల టీటీడీ ఛైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డికి రెండోసారి అవకాశం ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటినుంచి కసరత్తు ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాజాగా నూతన పాలక మండలి సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాలక మండలంలో ముగ్గురు ఎమ్మెల్యేలకు మాత్రమే చోటు దక్కింది. మిగిలిన వారంతా కొత్తవారు కావడం విశేషం. సభ్యులుగా నియమితులైన వారిలో పొన్నాడ వెంకట సతీష్ కుమార్ (ఎమ్మెల్యే), ఉదయభాను సామినేని (ఎమ్మెల్యే), తిప్పే స్వామి (ఎమ్మెల్యే), సిద్ధవటం యానాదయ్య, చాండే అస్వర్త నాయక్, మేక శేషుబాబు, ఆర్ వెంకట సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి గారి సీతారామరెడ్డి, గడి రాజు వెంకట సుబ్బరాజు, పేనక శరత్ చంద్రారెడ్డి, రామ్ రెడ్డి సాముల, బాలసుబ్రమణ్యన్ పళనీస్వామి, ఎస్. ఆర్ విశ్వనాథ్ రెడ్డి, గడ్డం సీతారెడ్డి, కృష్ణమూర్తి వైద్యనాథన్, సిద్దా వీర వెంకట సుధీర్ కుమార్, సుదర్శన్ వేణు, నెరుసు నాగసత్యం, ఆర్. వి. దేశ పాండే, అమోల్ కాలే, డాక్టర్ ఎస్ శంకర్, డాక్టర్ కేతన్ దేశాయ్, బోరా సౌరబ్ లు ఉన్నారు.

ఎర్రకోటపై యువగళం ఫ్లెక్సీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - గూడూరు : నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పదంలో నడవాలని కోరుకుంటూ శు క్రవారం సాయంత్రం గూడూరుకు చెందిన టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి వేముల సునీల్ ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్ ల వద్ద ఎదుట నారా లోకేష్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎం కావాలన్నారు. గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా 2024లో పాశం సునీల్ కుమార్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని ఆకాంక్షిం చారు.

31 నుండి జరిగే నాలుగవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర- తిరుపతి: ఈ నెల 31వ తేదీ నుండి జరిగే నాలుగవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో పీజీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని రిజిస్ట్రార్ ఆచార్య హుస్సేన్‌కి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న మాట్లాడుతూ ఈనెల 31 తేదీ నుండి ఎస్ఐ పరీక్ష క్వాలిఫై అయిన విద్యార్థినులకు గుంటూరులో దేహదారుఢ్య పరీక్షలు ఉండడంతో మన విశ్వవిద్యాలయంలో 4వ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అనేక మంది ఎస్సై పరీక్ష క్వాలిఫై అయిన విద్యార్థులు కూడా ఉన్నారని, అదే సమయంలో 31వ తేదీనే నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహి స్తున్నామని షెడ్యూల్డ్ విడుదల చేయడంతో విద్యార్థినిలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకొని నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని ఆయన రిజిస్ట్రారును విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రారు హుస్సేన్ శనివారం ఈ విషయంపై ప్రిన్సిపాల్‌తో సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని ఆయన తెలిపారు. నాలుగవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయకపోతే విద్యార్థినిలతో పెద్ద ఎత్తున ఉద్యమానికి పిలుపునిస్తామని చిన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాంతారామ్ జె పవార్ సేవలకు గుర్తింపు

శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి శాంతారామ్ జె.పవార్ నామకరణం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శాంతారామ్ జె పవార్ చేసిన సేవలను ప్రజలు గుర్తించుకునేలా శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి ఆయన పేరు పెడతామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ శాంతారామ్ జె పవార్ జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు పవార్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెంచు రెడ్డి, ఎస్‌సివి నాయుడు పాల్గొని శాంతారామ్ రావు జె పవార్ కుటుంబ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతారామ్ రావు జె పవార్ చేసిన సేవలను ప్రజలు గుర్తించుకునేలా శ్రీకాళహస్తి పురపాలకసంఘానికి ఆయన పేరు పెడతామని తెలియజేశారు. శాంతారామ్ రావు జె పవార్, విగ్రహాన్ని శ్రీకాళహస్తిలో ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపడతామని అన్నారు. దివంగత నేత శాంతారామ్ రావు జె పవార్ జయంతి సందర్భంగా అన్ని పార్టీలను ఒక స్టేజిపై తీసుకుని వచ్చిన ఘనత శాంతారామ్ రావు జెపవార్ కే దక్కుతుంద న్నారు. శాంతారామ్ రావు జె పవార్ శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ గా, పురపాలక సంఘం ఛైర్మన్‌గా అనేక సేవలను శ్రీకాళహస్తి ప్రజలకు అందజేశారని, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోకేష్ యాదవ్, కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ శెట్టిపల్లి సురేష్,టౌన్ ప్రెసిడెంట్ పగడాల రాజు, తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసు నాయుడు, బత్తి హేమ భూషణ్ రెడ్డి, రత్నం రెడ్డి, పటాన్ ఫరీద్, సిరాజ్ భాష, చంద్రయ్య నాయుడు, గోరా, డిష్ ధర్మయ్య,కొన్నలి రమేష్ తదితర నాయకులు అలాగే పవార్ కుటుంబ సభ్యులు జనార్దన్ రావు జె పవార్, డాక్టర్ అర్చన జె.పవార్, డాక్టర్ కిషోర్, ప్రతాప్ రావు వి.పవార్, పరమేశ్వర రావు వి.పవార్, ముకుంద రావు జె.పవార్, పి.వి.ఆర్. కుటుంబ సభ్యులు,రమణమూర్తి (స్వామి), మహేశ్వర రావు పడోల్కర్ పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా సెక్రటరీగా కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర- సత్యవేడు: వైసీపీ తిరుపతి జిల్లా సెక్రటరీగా తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణానికి చెందిన మాస్టర్ స్కూల్ అధినేత కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వైసీపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైసీపీ జిల్లా సెక్రటరీగా కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి నియమితులు కాగా, ఎగ్జిక్యూటివ్ మెంబరుగా సత్యవేడు పట్టణానికి చెందిన మస్తానీ నియమితులయ్యారు. కాగా జిల్లా కార్యదర్శిగా నియమితులైన కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి స్థానికంగా మాస్టర్ స్కూల్ నడుపుతున్నారు. ఈ క్రమంలో 2011లో తొలిసారిగా రాజకీయ అరంగేట్రం చేశారు. తదనుగుణంగా వైసీపీ ఆవిర్భావం తర్వాత చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ తీర్థాన్ని పుచ్చుకోవడంతో పాటు పార్టీ బలోపేతానికి, అధికారంలోకి తీసుకురావడానికి ఎనలేని కృషి చేశారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విధేయుడుగా కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహకారంతో జిల్లా వైసీపీ నూతన కార్యవర్గంలో చంద్రశేఖర్ రెడ్డి కి చోటు కల్పించారు. దీంతో పాటు రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమర్థులకు పట్టం కట్టాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు జిల్లా అధ్యక్షులు రామ్,కుమార్ రెడ్డి కొత్త కార్యవర్గాన్ని ఈ మేరకు ప్రకటించారు. వైసీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కూరపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణి విజయలక్ష్మి ప్రస్తుతం సత్యవేడు జడ్పిటిసిగా, స్త్రీశిశు సంక్షేమ స్థాయి సంఘ సభ్యులుగా కొనసాగుతున్నారు. కాగా వైసీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కూరపాటి చంద్రశేఖర్ రెడ్డికి సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి,గ్రామ సర్పంచులు రవి రెడ్డి ,రూబెన్,గోవింద్ స్వామి,శిరీష శ్రీనివాసులు రెడ్డి,నీరజ సంజీవరెడ్డి వ్యవసాయ మండల సలహా సంఘం ఛైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సలహా సంఘం సభ్యులు గోవింద్ స్వామి,మాస్టర్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి, సన్రైస్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ అభినందనలు తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం పూజలు

విశాలాంధ్ర-చిల్లకూరు : శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజ కార్యక్రమం తూర్పు కనుపూరు ముత్యాలమ్మ అమ్మ వారి సన్నిధిలో, కలవకొండ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో ఘనంగా అత్యంత వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ లు సిద్దారెడ్డి ఇంద్రసేనారెడ్డి, కందల ఆనందరావు లు ఇరు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి కొమ్మలపూడి నవీన్ కుమార్ తమ సిబ్బంది తో కలిసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఆలయపూజారులు తీర్థప్రసాదాలు అందచేశారు.

శాంతారాం పవార్ కాంస్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ మున్సిపల్ ఛైర్మన్, ధర్మకర్తల మం డలి మాజీ అధ్యక్షులు శాంతారాం పవార్ కాంస్య విగ్రహాన్ని శు క్రవారం ది స్కూల్ ఆవరణంలో ఆవిష్కరిం చా రు. అజాత శత్రు వుకు నివాళులు అర్పిం చ డానికి శ్రీకాళహస్తి రాజకీయ పార్టీల ప్రముఖ నాయకులందరూ ఒకే వేదికపై కనిపించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ సి వి నాయుడు, చెంచు రెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తదితర ప్రముఖులు విచ్చేశారు. ద స్కూల్ ఆవరణంలో శాంతారామ్ కాంస్య విగ్రహాన్ని ఆయన కుమార్తె డాక్టర్ అర్చన కిషోర్ పూజాది కార్యక్రమాలు నిర్వహించి, ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ సి వి నాయుడు మాట్లాడుతూ... అజాతశత్రువు, స్నేహశీలి శాంతారాం లేని లోటు పూడ్చలేనిదన్నారు. పవార్ ఆశయాలు కొనసాగిద్దాం అన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ శాంతారామ్ సేవలు ను కొనియాడారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ వారి ఆశీస్సులతోనే రాజకీయంగా అందరం ఎదిగామని వారి ఆశయాలు కొనసాగిస్తామన్నారు. శాంతా రామ్ పవార్ సేవలు నిరుపమానమని బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ శాంతారామ్ పవర్ నాటి తరానికి నేటి తరానికి ఆదర్శమన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రసంగిస్తూ పవార్ కుటుంబం రాజకీయ నాయకులు తయారుచేసే ఫ్యాక్టరీ అని గుర్తు చేశారు. కుటుంబం ఎంత మహారాజులైన సామాన్యంగా జీవిస్తూ పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సాగి ప్రజల ఆదరాభిమానాలు పొందారని కొనియాడారు. శాంతారామ్ పవర్ సేవలకు గుర్తుగా మున్సిపల్ కార్యాలయ భవనం కు శాంతారాం పేరు పెడతా మన్నారు. పట్టణంలో పవార్ పేరిట సర్కిల్ ఏర్పాటు చేసి ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పవార్ కుమార్తె అర్చన మాట్లాడుతూ పార్టీల కు అతీతంగా అందరూ వచ్చి మా నాన్న పై చూపిన అభిమానం, శ్రీకాళహస్తి ప్రజల రుణం తీర్చుకోలేనిది అన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా నాయకులంతా ఒకే వేదికపై రావడం అనేది నాడు నేడు శాంతారామ్ నాయకత్వానికి సాధ్యమైందని నేతలు గుర్తు చేసుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పవార్ కుటుంబీకులు జనార్ధన్ రావు పవర్, ప్రతాప్ రావు పవర్ ముకుందరావు పవర్ పివిఆర్ కుటుంబ సభ్యులు జీవి రమణమూర్తి స్వామి, రవీందర్ నాయుడు, మహేశ్వరరావు పడవల్కర్, పలమాల సుధాకర్, ద స్కూల్ ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ

విశాలాంధ్ర - గూడూరు : విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవనిగూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం గూడూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు జవాబుదారీగా పని చేస్తూ వారి మన్ననలు పొందేలా పని చేయడం పోలీసు ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పని చేస్తూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రతి పిటిషన్ ను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులు పెండింగ్ లో ఉంచరాదని సూచించారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు వారిని తనిఖీ చేయాలని సూచించారు. ప్రతి పెండింగ్ కేసును త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఆధునిక కాలంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకం వలన అమ్మాయిలకు ఆన్లైన్ లో వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ నేరస్థులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించినా, పని తీరు మెరుగుపర్చుకోకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులంటే ఓ నమ్మకమన్నారు. నమ్ముకున్న ప్రజలకు మనం అన్నివేళలా మంచి చేయాలని సూచించారు. పోలీసులు విధుల్లో సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల భద్రత, పోలీసుల బాధ్యతన్నారు. మహిళల రక్షణ కోసం బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకువచ్చిందని వివరించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువులు కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వారితో చాటింగ్ చేయవద్దని, ఇతరులు పెట్టే మెస్సేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ వేధింపులు, బ్లాక్ మెయిల్ చేయడంవంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి, అడ్డుకట్టవేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

తిరుచానూరులో శాస్త్రోక్తంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ జామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్ర నామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. ఈ పర్వదినాన అమ్మవారి బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పద్మావతీ ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు. అమ్మ వారిని 9 గ్రంథులతో (నూలు పోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. తరువాత 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మీ వ్రతం ముగిసింది. భక్తులను విశేషంగా అకట్టుకున్న వ్రత మండపం టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా అకట్టు కుంది. 20 మంది సిబ్బంది, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 20 వేల కట్ ఫ్లవర్స్ తో ఐదు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు. ఇందులో తమల పాకులు, ఆపిల్, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న, పైనాపిల్ వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా రూపొం దించారు. మండపం పై భాగంలో గజలక్ష్మీ అమ్మవారు, కింది భాగంలో రెండు వైపుల ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆస్థాన మండపాన్ని అష్ట లక్ష్మిమూర్తులతో, రోజాలు, తామరపూలు లాంటి రంగు రంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చెన్నైకి చెందిన దాత విరాళంతో పుష్పాలంకరణ చేపట్టామని ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు తెలిపారు.భక్తులందరూ వ్రతాన్ని వీక్షించేందుకు వీలుగా ఆస్థాన మండపంలో 2, పుష్కరిణి వద్ద 1, గంగుంద్ర మండపం వద్ద 1 కలిపి 4 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. స్వర్ణరథోత్సవం వరలక్ష్మీ వ్రతం సందర్భం గా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు , జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం దంపతులు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భవిష్యత్తుకు గ్యారంటీ-రచ్చబండ

విశాలాంధ్ర - చిట్టమూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు సునీల్ కుమార్ సూచనల మేరకు చిట్టమూరు మండల టిడిపి అధ్యక్షులు గనపర్తి కిషోర్ నాయుడు అధ్యక్షతన చిల్లమూరు టిడిపి నాయకులు నూతల పార్టీ ముని బాబు నాయుడు, అరిగాల ఓమనరావు, బసవనూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ-రచ్చబండను రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో చిల్లమూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు 2024వ సంవత్సరంలో ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు ఆయన చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు అనంతరం గ్రామంలో మహిళలకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రస్తుత ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై మహిళలకు తెలియజేసి ఇప్పటికే ఈ రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళ తమ కుటుంబంలో జరిగిన నష్టాన్ని వివరించి జరగబోయే అభివృద్ధిని గురించి తెలియపరచి కుటుంబంలో వ్యక్తులను చైతన్య పరచాలని రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ని గూడూరు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని, దశా,దిశా తెలిసిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన అవసరం ఈ రాష్ట్ర ప్రజలపై ఎంతైనా ఉందని నాయకులు మహిళా కార్యదర్శిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి భారతమ్మ,చిట్టమూరు మాజీ జడ్పిటిసి దువ్వూరు భారతి,కీర్తిపాటి సుధా పలుగురు టిడిపి నాయకులు చిల్లమూరు గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

యానాదుల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్

విశాలాంధ్ర- చిత్తూరు : యానాదుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కర్ణ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుడిపాల మండలం, చిత్తపార పంచాయతీ, రాయల్ చేను యానాది కాలనీలో తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎంపిడిఓ రాజశేఖర్ రెడ్డి లతో కలసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అజాధికా అమృత్ మహోత్సవం జరుపుకుంటున్నామని ఇంకా వెనుకబడిన గిరిజనులు (యానాదులకు) ఇంకా ఆధార్, రేషన్ కార్డులు లేవంటే చాలా బాధగా ఉందన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రాయల్ చేను యానాదుల కు ఆధార్, రేషన్ కార్డులు అందజేసి వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం కల్పించాలని సంబంధిత అధి,కారులను ఆదేశించారు. ఇంకా యానాదుల పూరి గుడిసెలో వున్నారని, వారి అందరికి గృహాలు మంజూరు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అర్హులైన వారికి పింఛన్లు, ఉపాధి జాబ్ కార్డులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గిరిజన పిల్లలను బడికి పంపించాలని, బాల్య వివాహాలు చేయకూడదని వారికి చూచించారు. రాయల్ చేను యానాదులకు బస్ సౌకర్యం కల్పించాలని జడ్జి కి విన్న వించగా వెంటనే ఆర్టీసీ రీజనల్ మేనేజర్ తో మాట్లాడి చిత్తూరు వయా చిత్తపార, వేలూరు కు వేలూరు నుండి మీదుగా చిత్తపార చిత్తూరు కు బస్ నడిపేందుకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని రీజనల్ మేనేజర్ తెలిపారన్న విషయాన్ని వారికి తెలిపారు. ఈ కాలనీ లో ఓ వ్యక్తి కి ట్రై సైకిల్ కావాలని జడ్జి దృష్టికి తీసుకురాగా వెంటనే విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల వారి ఫోన్ ద్వారా వివరించి ట్రై సైకిల్ అందజేయాలని ఆదేశించారు. హై కోర్టు ఎలాంటి కేసులు లేని గ్రామాలను గుర్తించాలని ఆదేశించిందని, వారి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా , గుడిపాల మండలం, చిత్తపార పంచాయతీ రాయల్ చేను యానాది కాలనీలో ఎలాంటి కేసులు లేవని గుర్తించారని నివేదికను రాష్ట్ర హై కోర్టుకు పంపుతామన్నారు. రాయల్ చేను యానాది కాలనీని ఆదర్శ కాలనీగా రాష్ట్ర హై కోర్టు ప్రకటిస్తుందని తెలిపారు. ఇక్కడ ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే అంతా కలిసి పరిష్కరిస్తారని యానాదులకు తెలిపారు. యానాది కాలనీ సమీపాన కొంత భూమి ఉందని, అభూమి లో అందరూ కలసి వ్యవసాయం చేసుకుంటున్నారని వారిలో వున్న ఐక్యత ప్రజలందరిలో ఉంటే ఎలాంటి కేసులు, సమస్యలు ఉండవని, అప్పుడే సమాజం బాగుంటుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు నెలలో ఒకసారైనా గిరిజన గ్రామాలలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకొని, మీ పరిధిలో పరిష్కారం కాకుంటే మీ పై స్థాయి అధికారులకు పంపించి మానవతా దృక్పథంతో వారి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్. మూర్తి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్, సహాయ ప్రాజెక్టు అధికారి (పబ్లిసిటీ) పి.వెంకట్రమణ, స్వచ్ఛంద సంస్థ నుండి రమాదేవి, అటవీ, విద్య, పోలీస్, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్, యానాది ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై ఉలవ విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని విజలాపురం పంచాయతీ రైతుభరోసా కేంద్రంలో మండల వైసీపీ అధ్యక్షుడు బాబురెడ్డి కో కన్వీనర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు 80 శాతం రాయితీ తో ఉలవ విత్తనాలను పంపిణీ ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఉలవ విత్తనాలు బయట నుంచి కొనుగోలు చేయాలంటే ఒక కిలో విత్తనాలు సుమారు 108 రూపాయలు ఉందని అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను 80 శాతం రాయితీపై ఒక కిలో కేవలం 21 రూపాయల కే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు తమవెంట తెచ్చుకుని పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమం లో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, కేశవరెడ్డి, మురుగేష్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరం లోని ఇరువారం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతు న్నాయని వీటిని ప్రజల సద్వినియం చేసుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు నగరపాలక సంస్థ అధికారులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లోని కందూరు గ్రామపంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రాయతి పై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెలిపారు. రైతుల కోసం పంపిన సబ్సిడీ ఉలవల ను తమ కున్న బీడు భూముల లో చల్లు కొని ఆర్థిక పరిస్థితి ని మెరుగు పరచుకోవలయునని ప్రజా ప్రతినిధులు రైతులు కు తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ బాష మసూద్, రామనారాయణ, పాలిటి, అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయ కుమారి పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా హేమ సుందర్ రెడ్డి

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయితీ మిట్టమీద రాచపల్లి కు చెందిన ఎం. హేమ సుందర్ రెడ్డి ని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తానని అన్నారు. తమను నియమించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం కలశ స్థాపన, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో పూజించి మంత్ర పుష్పంతో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు నిర్వహించారు. అమ్మవారికి పలు రకాల పండ్లు, తీపి పదార్థాలు, నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు వరలక్ష్మి వ్రతం విశిష్టత గురించి వివరించారు. మండలంలోని పలు గ్రామాలలో మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

చంద్రయాన్ 3 మర్రి వృక్షం..

విశాలాంధ్ర -పలమనేరు: చంద్రయాన్ 3 విజయానికి గుర్తుగా పలమనేరు ప్రకృతి కన్వీ నర్ మల్లి చెట్ల దేవేంద్ర గంటా ఊరు సమీపంలో చెరువు గట్టు దగ్గర ఒక మర్రి మొక్కను నాటా రు. ఈ సందర్భంగా ఆ మొక్కకు అందరూ కలిసి చంద్ర యాన్ 3 మొక్కగా నామ కరణం చేశారు. ప్రతి ఒక్క రూ తనకంటూ చెప్పుకో వడానికి మహా వృక్షాలను పెంచాలని దేవేంద్ర కోరా రు. ఈ కార్యక్రమంలో నేతాజి, సిద్దయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



లక్ష్యాలు సాధించాలంటే పిల్లలు ఆరోగ్యంగా వుండాలి

విశాలాంధ్ర- సదుం: జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల ను జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లలు ఆరోగ్యం గా వుంటేనే అన్ని రంగాల్లో రాణిస్తారని పరి శుభ్రమైన వాతారణంలో, మంచి పోష కాహారం తీసకోకపోవడం చాలా అవ సరం అన్నారు. ఆరోగ్యకరమైన అల వాట్లు కలిగితే చదువుమీద శ్రద్ధ ఏర్పడి వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. పిల్లలకు అందించే భోజనం తనఖీ చేసి, పరిసరాల పరిశుభ్రత పై సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం లో ఆరోగ్య పర్యవేక్షణ అధికారి ఉదయ్ భాస్కర్, సిబ్బంది సతాజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల కబడ్డీ విన్నర్ కప్ రాజేష్ టీమ్ కైవసం

విశాలాంధ్ర -వెదురుకుప్పం: మండలంలోని వైఎస్సార్ డిగ్రీ కళాశాల లో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన రాజేష్ టీమ్ కు లెక్చరర్ గౌరి విన్నర్ కప్ అందజేశారు. శుక్రవారం డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన డిగ్రీ పూర్తి చేసుకుని వెళు న్న విద్యార్థులకు ఫేర్వెల్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మాంబేడు గ్రామానికి చెందిన జి.రాజేష్ కెప్టెన్ సారథ్యం లో ఏడుగురు విద్యార్థులు కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి నందుకు విన్నర్ కప్ తో పాటు సర్టిఫికెట్ లు అందించారు.వీరి టీమ్ లో భరత్, పవన్ కుమార్,హేమంత్,అమర్నాథ్ రెడ్డి,ప్రసాద్,అనిల్ వున్నారు. కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు పలువురు కళాశాల లెక్చరర్ లు,ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. విద్యార్థులు విన్నర్ కప్ అందించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రోక్తంగా వరలక్ష్మీవ్రతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని బ్రహ్మగుడి ఆవరణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వ్రతానికి శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ముత్తై దువులు వందలాది మంది హాజరయ్యారు. వరలక్ష్మీవ్రతం పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వ్రతం చేశారు. ఈ సందర్భంగా ముత్తైదువులు వ్రతంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వ్రతానికి వచ్చిన ముత్తైదువులకు ఆలయం తరపున వాయనాలు అందజేశారు. ఈ వ్రతంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఈవో కేవీ సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర - కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసిన ద్రౌపదీ, ధర్మ రాజుల స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. ఈ సందర్భంగా అమ్మవారి ని శుక్రవారం వేకువ జామున సుప్ర భాతసేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంత'రం అమ్మవారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభర ణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని వైసీపీ పట్టణ అధ్యక్షురాలు మోహన కుమారి ఆధ్వర్యంలో ద్రౌపదీదేవీ అమ్మవారికి మహిళలు పూజా సామగ్రిని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు మోహనకుమారి జాకెట్లు, గాజులు, పసుపు, కుంకుమలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో భాగంగా ఆలయ అధ్యక్షుడు పి. సోమశేఖర్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్య క్షుడు హరిబాబు, కమిటీ సభ్యులు బాబురెడ్డి, ప్రకాష్ మొదలి, క్రిష్ణయ్య యాదవ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -సదుం: ఈ రోజు చేరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా గణాంక అధికారి జార్జ్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కేంద్రంలో కాన్పులు నిర్వహించాలని ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను విధిగా సాధించాలని, మూడు నెలల లోపు గర్భవతులను నమోదు చేయాలని వారికి అందించే వైద్యసేవలు తప్పక క్రమం తప్పక అందించాలన్నారు. ప్రతి గర్భవతి సుఖప్రసవం కోసం ప్రభుత్వ వైద్య శాలలలకు వెళ్లాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని, కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించే విధంగా అర్హులైన దంపతుల ను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరేశా, ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది ఉదయ్ భాస్కర్, నీలకంఠ, జానకి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు ఎంతో అవసరం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడిపాల : మండలంలోని యువతకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో 1 వ బహుమతి(రూ.10,000) 190 రామాపురం, 2 వ బహుమతి (రూ.7,000) కట్టకింద పల్లి, 3 వ బహుమతి (రూ.5,000) కైవసం చేసుకున్నారు. ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. యువతకు క్రీడలు ఎంతో ముఖ్యం అంటూ ప్రోత్సహించారు.

రాయితీ ఉలవలు పంపిణీ

విశాలాంధ్ర -పులిచెర్ల కల్లూరు: పులిచెర్ల రైతు భరోసా కేంద్రంలో రాయితీ పై ఉలవల పంపిణీ కార్యక్ర మాన్ని శుక్రవారం ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లా డుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి ప్రభుత్వం 80 శాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేస్తున్నదని అన్నారు. ఏఓ ఎమ్. ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేజీ ఉలవలు రూ 108 ఉండగా 80 శాతం రాయితీతో కేజీ రూ 21.60లతో ఒక్కొక్క రైతుకు 10 కేజీల బ్యాగు ఇస్తున్నామన్నారు. పంట వేసిన రైతులు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని, ఈ క్రాఫ్ బుకింగ్ చేసుకోకపోతే పంట నష్ట పరిహారం గ్రాఫ్ ఇన్సూరెన్స్ మొదలగునవి రైతుల నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరి గోవర్ధన్, సర్పంచ్ రాణి ప్రభాకర్, వైసిపి నాయకులు నాదముని రెడ్డి, గోవిందరెడ్డి, వీఏఏ లీలా ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని బైపాస్ రోడ్ లోని కోనేరు వద్ద వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయం లో ఉన్న అయ్యప్ప స్వాములకు ప్రతిఏటా హరిహర ట్రస్ట్ ద్వారా అన్న దానం నిర్వహిస్తున్నారని అందు లో భాగంగా శుక్రవారం బీసీవై పార్టీ అధినేత బి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో తన సొంత నిధుల ద్వారా స్వాములందరికీ 41 రోజుల పాటు అన్నదాన నిర్వహించడానికి కావాల్సిన వంటసామాగ్రి సమకూర్చారు. అయ్యప్ప స్వాములతో పాటు పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని భిక్ష చేశారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ 41 రోజులపాటు అయ్యప్ప స్వాములు ప్రత్యేక దీక్షతో నిత్యము అయ్యప్ప స్వామిని స్మరిస్తూ పూజలు చేశారు. ఆ స్వాములకు తమ వంతు సహాయంగా అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. స్వాములకు ఏ అవసరం ఉన్నా నేరుగా సంప్రదించవచ్చునని వారందరికీ అండగా నిలబడతామన్నారు.

ఉపాధితో సమగ్ర గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు: ఉపాధి హామీ పథకంతో గ్రామాలలో మౌలిక వసతులు సమకూరుతూ సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్య మవుతున్నదని సర్పంచ్ బడిగనేనిసరస్వతి, ఎంపీటీసీ బడిగనేని మంజుల మున స్వామి అన్నారు. పులిచెర్ల మండలం పాళెం లో శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన ఉపాధి సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వ హించారు. ఈ గ్రామ సభలో ఎంపీటీసీ మాట్లాడుతూ ఉపాధిలో పండ్ల తోట పెంపకం నీటి నిల్వ కుంటలు పనులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డిఆర్ పి పంచాయతీ పరిధిలో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన తనిఖీ నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షౌకత్ అలీ, నాయకులు రమేష్, నాగరాజ, టిపి మోహన్ బాబు, ఎఫ్ ఎ శారద, రైతులు కూలీలు పాల్గొన్నారు.

సమర భేరిని జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

విశాలాంధ్ర -చిత్తూరు : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆలిండియా కమిటీ పిలుపుమేరకు దేశ వ్యాప్తంగా సమర భేరి నిర్వహిస్తోందని అందులో భాగంగా రాష్ట్రంలో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు నిచ్చారు. శుక్రవారం ఇందుకు సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధిక ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్య ప్రజానీకం అతలాకుతలమవుతోందని తెలిపారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో ఒక ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఉన్న ఉద్యోగాలను తొలగి స్తున్నారని, దీంతో కోట్లాదిమంది నిరుద్యోగులై సమస్య తీవ్రతరం అవుతోం దన్నారు. విద్యుత్తు సంస్కరణల పేరుతో అన్ని రాష్ట్రాల మీద ఒత్తిడి తెస్తూ భారీ స్థాయిలో విద్యుత్ ఛార్జీలు పెంచుతోం దని, విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీలు ఎన్నడూ లేని విధంగా ఆరు రకాల రూపంలో భారీ స్థాయిలో పెంచారన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ భారాన్ని ప్రజలపై భారీగా మోపారని, ఈ సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలపై భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ స్థానిక సమస్యలపై ఒకటో తేదీన స్థానికంగా ఉన్న సచివాలయం వద్ద ప్రజలందరూ సమస్యలపై అర్జీల రూపంలో ఇవ్వాలని ,సెప్టెంబర్ 4న మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కే సురేంద్రన్, కార్యకర్తలు అయ్యప్ప, సుబ్రహ్మణ్యం, లోకనాథం పాల్గొన్నారు.

నవోదయ పరీక్ష దరఖాస్తుల గడువు పొడిగింపు

విశాలాంధ్ర-తిరుపతి: 2024 - 2025 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తుల సమర్పించడానికి 31 ఆగస్టు 2023వ తేదీ వరకు పొడగింగామని, ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల గురించి సమాచారం కోసం విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో పొందవచ్చని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టరు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8688888802, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

5 -18 సంవత్సరాల లోపు బాలబాలికల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-తిరుపతి: 5 నుండి 18 సంవత్సరాల లోపు బాల బాలికల వివరాలు ఆన్‌లైనులో వంద శాతం నమోదు చేయాలని సంబంధిత అధికా రులను, జిఈఆర్ వందశాతం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టర్ సమావేశ మందిరం లో విద్యా శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రాస్ ఎన్‌రోల్‌మెంటు రేషియో సర్వే నివేదిక పై, బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు, విద్యార్థుల సమాచారం 100 శాతం ఆన్‌లైనులో నమోదు చేయడానికి జిల్లా విద్యా శాఖ అధికారి, మండల విద్యా శాఖ అధికారులు, సెక్టోరియల్ ఆఫీసర్లతో, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి వారితో సమావేశం నిర్వహించారు. ఇంకా బడిలో చేరని, నమోదు కాని విద్యార్థులను బడిలో చేర్పించేలా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 5 నుండి 18 సంవత్సరాలలోపు వున్న 40,414 మంది విద్యార్థుల వివరాలు నమోదు కాలేదని, అందులో పదవ తరగతి పాస్ అయి, ఇంటర్మీడియట్ జాయిన్ కాని పిల్లలు, పాఠశాలలో కళాశాలలో చేరిన పిల్లల వివరాలను, వలసపోయిన విద్యార్థులను గుర్తించి వారి వివరాలను సంబంధిత పాఠశాల కళాశాల యాజమాన్యాలు 100 శాతం చైల్డ్ ఇన్ఫో పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలో ఉండేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, డిఎల్‌డిఓ సుశీలాదేవి, నాడు-నేడు ప్లానింగ్ కో ఆర్డినేటర్, రామచంద్ర రెడ్డి, ఆర్‌ఐఓ ప్రభాకర్ రెడ్డి, డివిఈఓ విశ్వనాథ నాయక్, సర్వ శిక్ష అభియాన్ సిఎంఓ, ఏఎంఓ సురేష్, శివ శంకరయ్య, ఆల్టర్నేటర్ స్కూల్ కోఆర్డినేటర్ (ఎఎల్ఎస్) శ్రీధర్, మండల విద్యాశాఖ అధికా రులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా మద్దాలి సోమశేఖర్ రెడ్డి

విశాలాంధ్ర- నాయుడుపేట : సమర్థుడైన వ్యక్తికి, సరైన సమయంలో, వైసిపి సముచిత స్థానం కల్పించింది. తిరుపతి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా వైసీపీ సీనియర్ నాయకులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. వైసీపీకి సేవలందించిన మద్దాలి సోమశేఖర్ రెడ్డిని పార్టీ అధిష్టానం గుర్తించింది. గతంలో చిల్లకూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ గా ఆయన విశేష సేవలు అందించారు. చిల్లకూరు సొసైటీ అధ్యక్షులుగా ఆయన పనిచేసిన అన్ని రోజులు రైతులకు అనేక సేవలు అందించారు. సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే చిల్లకూరు ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధి బాటన పయనించింది. వయసు పెరుగుతున్న ఆధునిక ఆలోచనలతో నిత్య యవ్వనుడు, మంచి మనసున్న సోమన్నకు ఆయన అభిమానులు నాయకులు నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. నాయుడుపేట స్థానిక శాసనసభ్యులు సంజీవయ్య, నాయుడుపేట లోని ఆయన నివాసం వద్ద నూతనంగా పార్టీ బాధ్యతలను స్వీకరిస్తున్న సోమశేఖర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల సమయం లో పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్ర మంగా నిర్వహిస్తూ, పార్టీకి మంచి పేరు తీసుకుని రావాలని సోమశేఖర్ రెడ్డిని సంజీవయ్య కోరారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర -వరదయ్యపాలెం : తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం పంచాయతీ పరిధిలోని రాచకంద్రిగ గ్రామ గిరిజన కాలనీలో గత కొన్ని నెలలుగా తాగునీటి కోసం ప్రజలు నానా రకాలుగా తంటాలు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఈ విషయమై సత్యవేడు నియోజకవర్గం ప్రచారం కార్యదర్శి ఓడూరు ఉజ్వలరెడ్డి దృష్టికి ప్రజలు తీసుకువెళ్లారు. ఈ విషయమై స్పందించిన ఆయన రాష్ట్ర దేవాంగ సంఘం డైరెక్టర్ తిలక్ బాబు దృష్టికి తీసుకు పోగా ఆయన జడ్‌పి టిసి వేంకటేశ్వర్లు ద్వారా జడ్‌పి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో శుక్రవారం ఓడూరు ఉజ్వలరెడ్డి గ్రామ ప్రజలతో కలిసి భూమిపూజ చేపట్టి, బోర్ వెల్ మిషన్ ద్వారా మంచి నీటి బోరు ఏర్పాటు కు శ్రీకారం చుట్టారు. ప్రజా సమస్యలపై తనదైన బాటలో ప్రత్యేక చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఉజ్వలరెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సెక్రటరీ పద్మనాభ రాజు, పంచాయతీ సిబ్బంది అశోక్, వెంకటేష్ మాజీ ఎంపిటిసి చెంగయ్య, గ్రామస్తులు అనంద్, గజేంద్ర, రమేష్ ఆశావర్కర్లు వాణి పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై అభినందన ర్యాలీ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : చంద్రయాన్ 3 విజయవంతం సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీకాళహస్తి లోని ఎంజీఎం స్కూల్ సంస్థల తరఫున అభినంద నలు తెలియజేస్తూ ర్యాలీ ని శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లా డుతూ ఇస్రో శాస్త్రవేత్తలు పంపిం చిన చంద్రయాన్ 3 విజయం పట్ల హర్షం వ్యక్తం చేసి శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నినాదంతో రాబోయే కాలంలో మన ఎంజీఎం విద్యా సంస్థలలో చదువుకున్న విద్యార్థులు మంచి శాస్త్ర వేత్తలు అవ్వాలని, ఆ వంతుగా కృషి చేయాలని మరొక్కసారి పిల్లలందరికీ తెలి పారు. చంద్రయాన్ 3 విజయవంతం సందర్భంగా ఎంజీఎం స్కూల్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని 4 వీధులు మన దేశ జెండా పట్టుకుని సగర్వంగా తిరుగుతూ ఇతర దేశాలకు భారత దేశ సత్తా ఏంటో తెలియ జేసిందని శాస్త్రవేత్తలకు మరొక్కసారి ఎంజిఎం స్కూల్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం స్కూల్ హెడ్మాస్టర్ ఈ మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్

- హోటల్ నిర్వాహకులకు ఎఫ్ఎస్ఎస్ఎఐ శిక్షణ

విశాలాంధ్ర - తిరుపతి సిటీ, తిరుమల:. తిరుపతికి నిరంతరం పెరిగే యాత్రి కుల తాకిడికి అనుగుణంగా ఆహార పదార్థాల్లో నాణ్యత పెంచే నిమిత్తం తిరుపతిలో ఫుడ్ టెస్టింగ్ అత్యాధునిక ల్యాబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెంకట రమణా రెడ్డి అన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించే దిశగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) పలు చర్యలు తీసుకోనుంది. ఇందుకోసం ఎఫ్ఎస్ఎస్ఎఐ ఆధ్వర్యంలో తిరుపతి లోని తాజ్ హోటల్ లో 41వ సెంట్రల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈవో ధర్మారెడ్డి పిలుపు మేరకు ఎఫ్ఎస్ఎస్ఎఐ అధికారులు తిరుమలను కూడా సందర్శించారు. తిరుపతిలో పాటు తిరుమలలో ఆహార నాణ్యత, అన్న ప్రసాదం , లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రం, నీటి సరఫరా తదితర అంశాల నిర్వహణను మరింత మెరుగు పర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎఫ్ఎస్ఎస్ఐ సిఇవో జి.కమలవర్ధనరావు, ఏపీ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జె.నివాస్, ఇతర అధికారులు టిటిడి ఈవోతో చర్చించారు. తిరుపతి లో అత్యాధునిక ఆహార నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ను ఏర్పాటు చేసేందుకు సుముఖతను వ్యక్తం చేశారు. అలాగే భక్తులకు ఆరోగ్యవంత మైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు టిటిడి సహకారంతో హోటళ్ల నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం, టిటిడి కలిసికట్టుగా పని చేసి భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోనున్నారు. తిరుపతి వేదికగా నిర్వహించిన ఎఫ్ఎస్ఎస్ఎఐ సెంట్రల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం సందర్భంగా ఆ దిశగా అడుగులు వేయనున్నారు.

జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికడదాం

- వీధి కుక్కలకు వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేపట్టాలి - అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర - తిరుపతి : జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి దిశగా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు శ్రీహరి జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ గురించి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జంతువుల నుండి కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. కుక్కలు కరిచినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రథమ చికిత్స ఇంటి దగ్గరే తీసుకొని దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా టిటి, ఏఆర్‌వి వ్యాక్సిన్ వేసుకోవాలని, ఆలస్యం చేస్తే ప్రమాదకరమన్నారు. వీధి కుక్కలకు వ్యాక్సి నే షన్ వేయించడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో డిపిఓ, పట్టణ పరిధిలో మున్సిపాలిటీ సిబ్బంది తగు చర్యలు తీసుకుని ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు శ్రీహరి, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవి కుమార్, డిసిహెచ్ఎస్ ఆనంద్ మూర్తి, ఉష కళావత్, వైరాలజీ స్విమ్స్ తిరుపతి, జూ పార్క్ చీఫ్ క్యూరేటర్ సెల్వం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు చీరలో ముత్యాలమ్మ

విశాలాంధ్ర-చిల్లకూరు: తూర్పు కనుపూరు దేవ స్థానంలో శుక్రవారం శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ముత్యాలమ్మ అమ్మ వారు భక్తులకు బంగారు చీరలో కన్నుల పండుగ గా కనువిందు గా దర్శనమిచ్చారు. కలవకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో అన్నదాన కార్యక్రమానికి దేవలయాల రూపకర్త, మాజీ గూడూరు ఎయంసి, పెద్దలు యరట పల్లి జానకిరామిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవ హరించారు.

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్య నగర్ లో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన ఆర్డీఓ కిరణ్ కుమార్ కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆర్డీఓ అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అఖిల్, వినీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి సత్సంగ నిలయంలో : గూడూరులోని పటేల్ వీధిలో ఉన్న శ్రీ సాయిసత్సంగ నిలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని కోట సునీల్ కుమార్, కోట ప్రకాశం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి లక్ష తులసీ పూజలో పాల్గొన్నారు.

జగనన్న వెంటే మహిళాలోకం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- నాయుడుపేట : జగనన్న వెంటే మహిళలు వున్నారని స్థానిక శాసన సభ్యులు సంజీవ య్య పేర్కొన్నారు. నాయుడుపేట పట్ట ణ పరిధిలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం స్థానిక శాసనసభ్యులు సంజీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్సార్ క్రాంతిపథం కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమం లో సంజీవయ్య మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ జగనన్న వెంటే మహిళ లోకం ఉందన్నారు. నాయుడుపేట అర్బన్, రూరల్, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన పొదుపు సంఘాలు, మెప్మా మహిళలు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమా వేశంలో పాల్గొనడానికి విచ్చేసిన సంజీవయ్యకు పొదుపు సంఘాల మహిళలు పూల బాటలు పరిచారు. 'వెల్‌కమ్.. ఎమ్మెల్యే సార్..!' అంటూ, రంగవల్లులు వేసి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సంజీవ య్యకు ప్రత్యేక ఆహ్వానాలు పలికారు. వీరి అభిమానాన్ని చూసిన సంజీవయ్య, తాను జన్మ జన్మలకు తన నియోజకవర్గ మహిళలకు రుణపడి ఉంటానని అన్నారు. మహిళల క్షేమం కోసం తాను అహర్నిశలు కష్టపడతానని మహిళ హర్షద్వానాల మధ్య పేర్కొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ పై వీఆర్వో దాడి

-పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-చంద్రగిరి: ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ మురుగేష్ పై విఆర్ఓ భాస్కరయ్య దాడి చేయడంతో మురుగేష్ శుక్రవారం టిడిపి నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెనుమూరు మండలం చెరువు ముందు ఊరికి చెందిన దళితుడైన తాను గత ఏడాది కాలం నుంచి చంద్రగిరి కావమ్మ గుడి వీధిలో కాపురం వుంటున్న బి.యుగంధర్ రెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నానని ఈ నెల 23వ తేదీ అన్ని రసీదులు పొంది తమ యజమాని స్వర్ణముఖి నదిలో ఇసుక కోసం పంపగా ఇసుకను నింపుకొని వస్తుండగా చంద్రగిరి-1 వీఆర్‌వో భాస్కరయ్య తమ ట్రాక్టర్ ఆపి అకారణంగా అసభ్య పదజాలంతో దూషించి తనపై దాడి చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కలికిరి మురుగేష్ శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మురుగేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ ట్రాక్టర్ యజమాని బి.యుగంధర్ రెడ్డి జైప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ కు చలాన కట్టి ఇసుక కోసం తనను స్వర్ణముఖి నదిలోకి పంపగా తాను ఇసుక నింపుకొని వస్తున్నానని, అదే సమయంలో చంద్రగిరి-1 కు చెందిన జి.భాస్కరయ్య తమ ఇసుక ట్రాక్టర్ ఆపి అనుమతులు చూపించాలని ప్రశ్నించారని తాను ఆ రసీదులు చూపించానని ఇవి చెల్లవు అన్నాడని వెంటనే తమ యజమానితో మాట్లాడాలని చెప్పానని తెలిపారు. ఇదేమీ వినక 'మీ యజమాని ఎవరు రా?' అంటూ బూతులు తిడుతూ తన చొక్కా పట్టుకుని ట్రాక్టర్ కిందికి లాగి పక్కనే ఉన్న కర్ర తీసుకొని తమ ట్రాక్టర్ కూలీలు చూస్తుండగానే తనను కొట్టాడన్నారు. తర్వాత తనను తన ట్రాక్టర్ ను తమ ఓనర్ కు అప్పగించి తమ ఊరికి వెళ్లాలనని తెలిపారు. అకారణంగా తనను దూషించి దౌర్జన్యం చేసిన వీఆర్వో భాస్కరయ్యపై చర్యలు తీసుకోవాలని మురుగేష్ టిడిపి నాయకులతో కలిసి పోలీసు లకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు మాట్లాడుతూ ఇసుక రవాణా పై స్థానిక రెవెన్యూ అధికారులకు అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎవరు చలా నా వసూలు చేస్తున్నారో? ఎందుకు వసూలు చేస్తున్నారో? వారికి అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవలే అక్రమ ఇసుక రవాణా కారణంగా ఓ విద్యార్థి బలి కావడంతో ఆ నాటి నుండి ఇసుక తరలింపు ఇకపై జరగబోదని స్వయాన జిల్లా అధికారులే ప్రకటించినా ప్రతిరోజు భారీ యంత్రాలతో ఇసుక తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీ ట్రాక్టర్లు ఇసుక కోసం వెళితే వెంటనే పసిగట్టి వారి వాహనాలను అడ్డుకోవడం లేదా సీజ్ చేయటం చేస్తున్న రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకుల వాహనాలు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా పట్టించుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. 'పై స్థాయి నాయకుల ఒత్తిడా, పైసలకు కక్కుర్తా?' అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ చంద్రగిరి మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, తిరుపతి మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, జడ్పిటిసి మాజీ సభ్యులు రమేష్ రెడ్డి, సక్కూరి ధనంజయ రెడ్డి, రాజుగారి వినోద్ రెడ్డి, ఎజిపల్లి బాల, సునీల్, గురుమ్మూర్తి రెడ్డి, గోపి, కాపువీధి సునీల్, మన్సూర్, బాషా పాల్గొన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై సమీక్ష: ఆర్డీఓ



విశాలాంధ్ర - గూడూరు : ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ఓటరు జాబితా అభ్యంతరాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆర్డీఓ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు నుండి ఓటు హక్కు లేని వారు పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా అభ్యంతరాలపై చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు ఓటర్ వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో ప్రతి మంగళవారం సమావేశం నిర్వహిస్తామని ఓటర్ లిస్ట్ పై అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు. నూతన ఓటరు నమోదు నిరంతరం కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు సమస్యలను రాజకీయ పార్టీ నాయకులు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు.

చంద్రయాన్-3, ఇతర ఇస్రో కార్యక్రమాల్లో శ్రీసిటీ పరిశ్రమల భాగస్వామ్యం

- మేక్ ఇన్ ఇండియా' చిహ్నంగా పలు జాతీయ ప్రాజెక్టులతో శ్రీసిటీ అనుబంధం

విశాలాంధ్ర- సత్యవేడు: చంద్రునిపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్, భారతదేశ వైజ్ఞానిక సమాజానికి గర్వకారణం మాత్రమే కాదని, ఇది దేశీయ పారిశ్రామిక రంగానికి కూడా అత్యంత ప్రోత్సాహక అంశం. ప్రాజెక్ట్ నిర్వహణకు ఇస్రో నాయకత్వం వహించినప్పటికీ ప్రభుత్వ ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ వారికి తగిన గుర్తింపుని తీసుకువస్తోంది. ఇస్రో ఈ అద్భుతమైన ప్రయోగం ద్వారా లాంచ్ వెహికల్, అంతరిక్ష నౌక, ఇతర అంతరిక్ష ప్రయోగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను, పరికరాలను సరఫరా చేస్తూ పలు దేశీయ పరిశ్రమలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కోవలో, చంద్రయాన్-3 మిషన్‌తో సహా ఇస్రో పలు కార్యక్రమాలలో శ్రీసిటీలోని వి ఆర్ వి (చార్ట్ గ్రూప్), రోటోలోక్, వాల్-మెట్ ఇంజినీరింగ్ అనే మూడు పరిశ్రమలు భాగస్వామ్యం కావడం శ్రీసిటీకి గర్వకారణం. విఆర్వి పరిశ్రమ అమెరికా చార్ట్ గ్రూప్ కు చెందింది. ఇది నైట్రోజన్ ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, ద్రవ హైడ్రోజన్, సహజ వాయువుల నిల్వ, పంపిణీ కోసం పూర్తి స్థాయి ఉత్పత్తులను డిజైన్ చేస్తుంది. మేక్ ఇన్ ఇండియా పథకం కింద ఇస్రో సహకారంతో లిక్విడ్ నైట్రోజన్ షీల్డ్ కలిగిన అత్యాధునికమైన పెద్ద ఎల్ హెచ్2 నిల్వ ట్యాంక్‌ను (షార్ కేంద్రం) సరఫరా చేసింది. ఈ ట్యాంక్ నిల్వ సామర్థ్యం 120 కిలో లీటర్లు. ఎల్వీఎం -3,జిఎస్ఎల్వి రాకెట్ల క్రయోజెనిక్ దశలో ఎల్ హెచ్ 2 ట్యాంక్ ద్వారా ఇంధనం నిల్వ చేశారు. శ్రీసిటీలోని యూకె కు చెందిన రోటోలాక్ ఇండియా పరిశ్రమలో కొన్ని పౌడర్ లు మరియు బల్క్ మెటీరియల్ హ్యాండ్లింగ్ ఉత్పత్తులలో భాగమైన రోటరీ ఎయిర్‌లాక్‌లు, డైవర్టర్ వాల్వ్‌లు, స్లైడ్ వాల్వ్‌లు, బిగ్ బ్యాగ్ సిస్టమ్‌లు, కన్వేయర్లు, డిశ్చార్జ్ యూనిట్లు తయారు చేస్తారు. రోటోలోక్ ఉత్పత్తులను శ్రీహరికోటలోని ఇస్రో సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్ తయారీ ప్లాంట్‌లో ఉపయోగిస్తున్నారు. శ్రీసిటీలోని వాల్-మెట్ ఇంజినీరింగ్ సంస్థ సూపర్ అల్లాయ్స్ నికెల్, టైటానియం, కోబాల్ట్, అల్యూమినియం మొదలైన వాటిని వివిధ రూపాల్లో ఎల్ వి ఎం 3, చంద్రయాన్ -3 వ్యోమనౌకలతో సహా ఇస్రో లాంచ్ వెహికల్స్, ఉపగ్రహాల హార్డ్‌వేర్‌లను రూపొందించడానికి ముడి పదార్థాలుగా సరఫరా చేస్తోంది. ఇస్రోతో భాగస్వామ్యానికి పైన పేర్కొన్న పరిశ్రమలను అభినందనలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో జాతీయ అంతరిక్ష కార్యక్రమానికి ఈ పరిశ్రమలు తమ ఉత్పత్తులను సరఫరా చేయడం సంతోషదాయకమని, శ్రీసిటీకి గర్వకారణం అన్నారు. మున్ముందు ఇలాంటి ఆత్మనిర్భరతా కార్యక్రమాలలో మరిన్ని శ్రీసిటీ పరిశ్రమలు భాగస్వామ్యం కావడానికి ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ "మేక్ ఇన్ ఇండియా" ప్రచారానికి అనుగుణంగా శ్రీసిటీలోని పలు పరిశ్రమలు అనేక ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులకు తమ ఉత్పత్తులను అందిస్తున్నాయని, దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఎగుమతులను గణనీయంగా పెంచుతున్నాయంటూ డాక్టర్ రవీంద్ర తెలిపారు.

వధూవరులకు పెళ్లి కానుక పంపిణీ

విశాలాంధ్ర - రామచంద్రాపురం : చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పెళ్లిళ్లకు చంద్రగిరి ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఎంతో ప్రతిష్టాత్మకంగా పార్టీలకు అతీతంగా నూతన వధూవరులకు పెళ్లి కానుక పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా భాగంగా శుక్రవారం మండలంలోని కె.కె.వి పురం పంచాయతీకి చెందిన నూతన వధూవరులు మనీషా, లోకేష్ లకు ఎమ్మెల్యే తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి చేతుల మీదుగా నూతన వస్త్రాలతో పాటు తాళిబొట్టు , వెండి మెట్టెలు, గాజులు, స్వీట్‌బాక్స్, పెళ్లి శుభాకాంక్షలు గ్రీటింగ్ కార్డును అందించారు. ఆయనతో పాటు ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి, వైసిపి నాయకులు వల్లేటి భానుకుమార్ రెడ్డి, భాస్కర్ యాదవ్, సచివాలయ కన్వీనర్ జానకిరామ్, యస్ యస్ కోటియాదవ్ ఉన్నారు.

వైభవంగా సౌభాగ్య మహాలక్ష్మీ వ్రత వార్షికోత్సవం

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలంలోని నడవలూరులో వెలసిన జగన్మంగళ దేవతా సౌభాగ్య మహాలక్ష్మి వ్రత 76 వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. ముందు ఆలయానికి చేరుకున్న ఆమెకు నాసిరెడ్డి తనూజ యోగానంద రెడ్డి దంపతులు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందించి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు కృష్ణమూర్తి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెవిరెడ్డి లక్ష్మి మహిళలతో పాటు గోపూజలో పాల్గొని గోమాతకు పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహకులు అమ్మవారికి సహస్ర నామార్చన హోమం, గోపూజ మంగళ హారతులు నిర్వహించారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలకు పసుపు కుంకుమ దారాలు జాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించు కున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే నిర్వహించిన హరికథ, లలిత కచ్చేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీరాణి, వైసిపి మండల కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, పానకం రామిరెడ్డి, పంచాయతీ కన్వీనర్ సిద్ధరామిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ద్రౌపది, ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు

పట్టు వస్త్రాలు సమర్పించిన శ్రీశైలం ఆలయ చైర్మన్ చక్రపాణి రెడ్డి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం తరఫున చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమ ర్పించారు. ముందు స్థానిక బజారు వీధిలో వెలసిన శెల్వ వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నడక మార్గంలో తన సహచర బృందంతో కలిసి సంప్రదాయ బద్ధంగా మంగళ వాయిద్యాలు నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామికి పట్టువస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమ, పూలు పండ్లు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు సిఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో సుభిక్షంగా ఉండాలని, ఆయన అందించే నవ రత్నాల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్వామి అమ్మవార్ల ను కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం దేవస్థానం వేద పండితులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఏలుమలై, రాష్ట్ర ఈడిగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కే.జే.కుమార్, విజయపురం జడ్పీటీసీ లక్ష్మీపతి రాజు, వడమాలపేట మాజీ ఎంపీపీ మురళీ రెడ్డి, నాయకులు రవిశేఖర్ రాజు, నారాయణ బాబు, శ్రీధర్ రాజు, బేతు సుబ్రమణ్యం, తదితర నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. విభజన హామీలలో ముఖ్యమంత్రి జగన్ చిత్త శుద్ధికి గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణమే గొప్ప నిదర్శనం అని చెప్పారు. 2014లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు 13 కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. నాలుగేళ్లలో పోర్టులు, మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిన సీఎం జగన్ కేంద్ర సంస్థల ఏర్పాటులో ఫలప్రదమయ్యారని వివరించారు. ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(సీటీయూఏపీ)కి 561.88 ఎకరాల భూమిని కేటాయించడంలో సీఎం జగన్ తీసుకున్న చొరవతో దాని నిర్మాణానికి మార్గం సుగమం అయ్యిందన్నారు.సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు శంకర్ నాయక్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతమ్మకు సారె సమర్పణ

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలంలోని సొరకాయలపాళ్యం పంచాయతీ ఆది ఆంధ్రవాడలో గ్రామస్తులు గత వారం రోజులుగా మాతమ్మ తిరునాళ్ళు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రేణుకా మాతమ్మ తల్లికి మేళా తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ సమర్పించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న మోహిత్ రెడ్డికి భాస్కర్ యాదవ్, యస్ యస్ కోటి యాదవ్, ఆది ఆంధ్రవాడ గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. డప్పుల మోత నడుమ ఊరేగింపుగా మాతమ్మ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానంద రెడ్డి , మండల కన్వీనర్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టి గిరిధర్ రెడ్డి, నాసిరెడ్డి యోగానంద రెడ్డి మాజీ దేవరాజు రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిల్లమూరులో భవిష్యత్తుకు గ్యారంటీ-రచ్చబండ

విశాలాంధ్ర - చిట్టమూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గూడూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు సునీల్ కుమార్ సూచనల మేరకు చిట్టమూరు మండల టిడిపి అధ్యక్షులు గనపర్తి కిషోర్ నాయుడు అధ్యక్షతన చిల్లమూరు టిడిపి నాయకులు నూతల పార్టీ ముని బాబు నాయుడు, అరిగాల ఓమనరావు, బసవనూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ-రచ్చబండను రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో చిల్లమూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు 2024వ సంవత్సరంలో ముఖ్యమంత్రి అయిన తర్వాత మహిళలకు ఆయన చేయబోయే అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు అనంతరం గ్రామంలో మహిళలకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రస్తుత ప్రభుత్వం వ్యతిరేక విధానాలపై మహిళలకు తెలియజేసి ఇప్పటికే ఈ రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని రానున్న ఎన్నికల్లో ప్రతి మహిళ తమ కుటుంబంలో జరిగిన నష్టాన్ని వివరించి జరగబోయే అభివృద్ధిని గురించి తెలియపరచి కుటుంబంలో వ్యక్తులను చైతన్య పరచాలని రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్ ని గూడూరు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని, దశా,దిశా తెలిసిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన అవసరం ఈ రాష్ట్ర ప్రజలపై ఎంతైనా ఉందని నాయకులు మహిళా కార్యదర్శిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి భారతమ్మ,చిట్టమూరు మాజీ జడ్పిటిసి దువ్వూరు భారతి,కీర్తిపాటి సుధా పలుగురు టిడిపి నాయకులు చిల్లమూరు గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.